క్లుప్తంగా

నియామకం



బాల్‌రాజ్‌కు నియామకపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మండల పరిధిలోని గొల్లూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెండ్యాల బాల్‌రాజ్ నియమితులయ్యారు. ఆదివారం మండల పరిధిలోని తుక్కుగూడలోని కేఎల్‌ఆర్ కార్యాలయంలో బాల్‌రాజ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన పెండ్యాల బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ దళితులకు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో అధిక ప్రాధాన్యత కల్పించి గౌరవిస్తుందన్నారు. దళితుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. దళితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగంగా పరిష్కరిస్తామన్నారు. ఈ పదవీ తనపై మరింత బాధ్యతను పెంచిందని, తనకు ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నర్సింహ, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.

బాల్యమిత్రునికి ఆపన్న హస్తం



శివకు నగదు అందజేస్తున్న మిత్రబృందం

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్నేహితుడికి.. బాల్య మిత్రులు అండగా నిలిచారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988– 89 సంవత్సరంలో పదో తరగతి చదివిన జంతుక యాదయ్య.. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు.. రూ.50 వేలు సమకూర్చి, బాధితుడి కుమారుడు శివకు అందజేశారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



జైశ్రీరాం జట్టుకు కప్, నగదు అందజేస్తున్న నిర్వాహకులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధి కవాడిపల్లి గ్రామంలో రెండు నెలలుగా నిర్వహిస్తున్న కవాడిపల్లి ప్రీమియర్ లీగ్– 09 (కేపీఎల్) క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. ఏటా జనవరి 26న నిర్వహించే మ్యాచ్‌లో.. ఆదివారం జరిగిన తుది పోరులో డీవైజీ జట్టుపై జై శ్రీరాం జట్టు విజయం సాధించింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన బొడిగే ఆనంద్‌గౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు వీరస్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సురేష్‌గౌడ్, నవీన్‌గౌడ్‌ల చేతుల మీదుగా కూడా విన్నర్, రన్నర్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. వీటితో పాటు కేపీఎల్ నిర్వాహకులు విజేత జట్టుకు రూ.66,666ల నగదు, రన్నర్‌కు రూ.44,444 నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దూసరి సుజాత, ఇరుగు చిత్తారి, నాయకులు బొడిగె రమేష్‌గౌడ్, కొండల్‌గౌడ్, సాయిరెడ్డి, రవియాదవ్, శ్రీకాంత్, యాదగిరి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 17న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాషాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఎనుగొండలోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా నేత్ర శస్త్రచికిత్స చేయించనున్నామని వివరించారు. చూపు సమస్య ఉన్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు పోతెపల్లిలో..

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న వెల్దండ మండలం పోతెపల్లి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిలువ నీడ కరువు!



శ్రీరాం కాలనీలో ఎండలో వేచి చూస్తున్న ప్రయాణికులు

- జల్‌పల్లి మున్సిపాలిటీలో కానరాని బస్‌షెల్టర్లు
- ఎండ, వానలోనూ ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

పహాడీషరీఫ్: ఈ వేసవి కాలంలో వందేళ్ల నాటి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ చేసిన ప్రకటన అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. పసిఫిక్, హిందూ మహా సముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులు, లానినా బలహీనపడటంతో మార్చి నెల నుంచి మే వరకు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు నమోదు కానున్నాయి. ఇక గత ఫిబ్రవరి మాసంలో 124 ఏళ్ల క్రితం నమోదైన ఉష్ణోగ్రతలు రిపీట్ అయ్యాయి. ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ అధికారులు ప్రకటనలు చేస్తున్నారు. కానీ ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్లను నిర్మించాలన్న ధ్యాస మరిచారు. నగరాన్ని ఆనుకొని ఉన్న జల్‌పల్లి మున్సిపాలిటీలో బస్‌షెల్టర్లు లేని కారణంగా ఆర్టీసీ ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. చలికి వణికిపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

రెండు శాఖల మధ్య సమన్వయలోపం..

బస్సు షెల్టర్ల నిర్మాణంపై అటు ఆర్టీసీ, ఇటు మున్సిపాలిటీ అధికారుల మధ్య సమన్వయ లోపం నెలకొంది. హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ షెల్టర్ల నిర్మాణ బాధ్యత తీసుకుంటోంది. షెల్టర్లలో సదుపాయాల కోసం యాడ్ ఏజెన్సీల ద్వారా నిధులు సమకూర్చుకుంటోంది. ఇక ఆయా షెల్టర్లలో సమస్యల విషయమై ప్రయాణికులు ఫిర్యాదు చేసేందుకు ఏకంగా క్యూఆర్ స్కానర్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకురానుంది. ఇక్కడ కూడా అలాంటి షెల్టర్లను అందుబాటులోకి తీసుకురావాలన్నా డిమాండ్ వినిపిస్తోంది.

ప్రయాణికుల అవస్థలు..

మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీకి పెద్దసంఖ్యలో నడిచే ఆర్టీసీ బస్సులు ఎప్పుడు చూసినా రద్దీ నెలకొని ఉంటుంది. కానీ ఇక్కడ బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాప్ నుంచి కింది బస్టాప్ వరకు రోడ్డుకు ఇరువైపులా వ్యాపారస్తులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో ట్రాఫిక్ కూడా స్తంభించిపోతున్న ఘటనలు ఉన్నాయి. దీంతో పాటు జల్‌పల్లిలో కూడా బస్‌షెల్టర్ మచ్చుకైనా లేదు. శ్రీశైలం ప్రధాన రహదారిపై ఉన్న పహాడీషరీఫ్‌లో చిన్నపాటి షెల్టర్ ఉన్నప్పటికీ, అది ప్రయాణికులకు ఎందుకు పనికిరాని పరిస్థితి నెలకొంది. నగర శివారు ప్రాంతం కావడంతో బస్‌షెల్టర్లు లేని కారణంగా రహదారులపై నిలబడుతున్న మహిళా ప్రయాణికులకు చైన్ స్నాచర్ల బెడద కూడా పట్టుకుంది. జల్‌పల్లి కమాన్, షాహీన్‌నగర్, ఎర్రకుంటలలో ప్రయాణికులకు అవసరమైన స్థాయిలో అధునాతన షెల్టర్లు నిర్మించాలని కోరుతున్నారు.

బస్ షెల్టర్లు నిర్మించాలి



ప్రయాణికులే తమ సంస్థకు నిధి. వారికి అన్ని రకాల సదుపాయాలు కలిపించడమే తమ విధి అంటూ పేర్కొనే ఆర్టీసీ అధికారులు షెల్టర్ల నిర్మాణ విషయమై మున్సిపాలిటీ అధికారులతో సమన్వయం చేసుకోవాలి. శ్రీరాంకాలనీ నుంచి వివిధ పనుల నిమిత్తం నిత్యం పెద్దసంఖ్యలో ప్రయాణికులు బస్సులను ఆశ్రయిస్తారు. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై ఫుట్‌పాత్ ఆక్రమణలతో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ విషయంలో మున్సిపాలిటీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– సంతోష్, శ్రీరాం కాలనీ

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

- పీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత
- మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

బడంగ్‌పేట్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం బడంగ్‌పేట సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు దహనం కార్యక్రమం చేపట్టినట్లు గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ సభ్యుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత మాట్లాడుతూ.. సభకు పెద్దన్నలా వ్యవహరిస్తూ చక్కదిద్దుతున్న దళిత ముద్దుబిడ్డ గడ్డం ప్రసాద్‌ను జీర్ణించుకోలేక మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అవమానకరంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సభాపతిని అధికార, ప్రతిపక్ష సభ్యులు ఎవరైనా గౌరవించాలన్నారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ దళితుడైన సభాపతిని హేళన చేసేలా మాట్లాడిన జగదీశ్వర్‌రెడ్డిపై సభాహక్కుల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అమరేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్, జైహింద్, నాయకులు బి.జంగయ్య, గట్టు బాలకృష్ణ, భాస్కర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



స్వామివారి ఊరేగింపులో భక్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం దేవునిపడకల్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు ఆదివారం మోహిని సేవ, హోమం, ఎదుర్కోల్లు, హనుమత్‌సేవ ఆలయ పూజారి రామాచార్యులు, గోపాలాచార్యులు, ఆదిత్య, చక్రవర్తిల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి, ఈఓ స్నేహలత, మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తిరుపతి, శంకర్, రవి, యాదయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కందుకూరు నుంచి ఫార్మా రహదారి వరకు నిర్మిస్తున్న రహదారికి నిధులు కొరత ఏర్పడిందని, అదనంగా నిధులు కేటాయించాలని కోరుతూ ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, అదేవిధంగా కొలన్‌గూడ నుంచి ఎలిమినేడు మధ్యలో రహదారి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ గ్రామానికి చెందిన ఆదర్ల గణేశ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం వేర్వేరుగా ఎమ్మెల్యేను ఆమె నివాసంలో కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రహదారులు బాగుచేసే బాధ్యత తీసుకున్నానని, వాటికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయిస్తానన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని, తర్వాత మనలను నమ్మి గెలిపించిన ప్రజలకు సేవచేయాలని సూచించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ఆదర్ల గణేశ్, తాళ్ల కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, గొరిగె బీరప్ప, బండ వేణు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



కేఎల్‌ఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుష్ప, నాయకులు

కందుకూరు: మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన మండల పరిధిలోని నేదునూరుకు చెందిన అంకగళ్ల పుష్పదర్శన్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కో–ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బొర్ర సురేశ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నాగని శ్రీహరి కేఎల్‌ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ బలోపేతానికి అందరూ కృషిచేయాలని ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, పీసీసీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, డైరెక్టర్ శివగల యాదయ్య, నాయకులు ఎ.బాలయ్య, ఇంద్రకంటి రాకేశ్‌గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్ష

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణ అనంతరం ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ తలకొండపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆరో రోజుకు చేరుకుంది. ఆదివారం దీక్ష శిబిరాన్ని మాజీ సర్పంచ్ జోతయ్య ప్రారంభించారు. దీక్షలో సమితి చుక్కాపూర్ నాయకులు యాదయ్య, మల్లేశ్, రాజశేఖర్, శ్రీను, శివమణి, శ్రీనివాస్, నవీన్, చిన్నా, గణేశ్, మనోహర్, శ్రీకాంత్‌లు కూర్చున్నారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్ మాదిగ మాట్లాడుతూ.. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. అనంతరం వివిధ పోటీ పరీక్షల ఫలితాలు ప్రకటించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మహేశ్, సమితి మండల నాయకులు యాదయ్య, నాయకులు సంజీవ్, రాజు, సురేశ్‌కుమార్, చంద్రశేఖర్, అజయ్, శశికాంత్, బాలరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

‘పన్నులు తగ్గించేవరకు పోరాటం’



సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీలు, ఫెడరేషన్ ప్రతినిధులు

మీర్‌పేట: అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొనిపోయి ఇంటి పన్నులు తగ్గించేవరకు పోరాటం చేస్తామని ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఓల్డ్ గాయత్రీనగర్ కమ్యూనిటీ హాల్‌లో మీర్‌పేట కార్పొరేషన్ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఇంటి పన్నుల తగ్గింపు కోసం ఫెడరేషన్ చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని అఖిలపక్షాన్ని కోరామని, అదేవిధంగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని అన్ని పార్టీల ప్రతినిధులతో తీర్మానం చేయించామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేశ్‌గౌడ్, బీఎస్పీ ఇన్‌చార్జి ఇందుమతి, సీపీఐ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఎం కార్యదర్శి యాదయ్య, ప్రకాశ్‌రెడ్డి, ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రతినిధులు మల్లారెడ్డి, వెంకటయ్య, ప్రేమ్‌చందర్‌రెడ్డి, శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి ఫెడరేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు

ఏసీపీ కేపీవీ రాజు



సాంస్కృతిక కార్యక్రమంలో ఏసీపీ, పాఠశాల సిబ్బంది తదితరులు

యాచారం: మంచిగా చదువుకుంటే భవిషత్తు బంగారు మయంగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. మండల పరిధి నందివనపర్తి ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి ఎంతో విలువైనదని, కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. చేడు వ్యసనాలకు అలవాటు పడి, జీవితాలను నాశనం చేసుకోవద్దని, మంచి మార్గాలనుఎంచుకోవడంతోనే జీవితం ప్రశాంతంగాఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, జ్ఞాన సరస్వతి దేవాలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డి, సీఐనందీశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకటరమణ శాస్త్రీ, పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర నాయకులు జగన్మోహన్ గుప్తా, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు దాటితే అంతంతే..

పేరు గొప్ప ఆస్పత్రి 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం. ఇక్కడ సుమారు ఎనిమిది మంది వైద్యులతో పాటు మరో 21 మంది సిబ్బంది పనిచేస్తుంటారు. కానీ సాయంత్రం నాలుగు దాటిందంటే ధర్మాస్పత్రిలో నిశ్శబ్దం నెలకొంటుంది. వైద్యులు ఉండరు. ఎమర్జెన్సీ కేసులు పట్టరు! పట్టినా ప్రాథమిక చికిత్స అనంతరం నగరానికి రిఫర్ చేస్తున్నారు.

- పట్నం ధర్మాస్పత్రికి గ్రహణం
- అందుబాటులో ఉండని వైద్యులు
- రెండు వైద్య శాఖల మధ్య సమన్వయ లోపం
- కుంటుపడిన వైద్య సేవలు



ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రి

ఇబ్రహీంపట్నం: డీఎంహెచ్‌ఓ (జిల్లా వైద్య ఆరోగ్య అధికారి) ఆధీనంలోని ఇబ్రహీంపట్నం 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని గత ప్రభుత్వ హయాంలో వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తెచ్చారు. ఇరు వైద్య శాఖల సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారు. అయినప్పటికీ సమన్వయలోపంతో వైద్య సేవలు పూర్తిగా కుంటుపడ్డాయి!

నగరానికి రిఫర్

నియోజకవర్గ కేంద్రమైన ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ నుంచి ముగ్గురు వైద్యులు, 8 మంది నర్సింగ్ సిబ్బంది, వైద్య విధాన పరిషత్ నుంచి ఐదుగురు డాక్టర్లు, ఇద్దరు నర్సింగ్ సిబ్బంది, 11 మంది నాలుగో తరగతి సిబ్బంది పనిచేస్తున్నారు. అప్పట్లో సాయంత్రం వేళలో రోజుకో వైద్యుడు అందుబాటులో ఉండగా.. నేడు ఆ పరిస్థితి మారిపోయింది. సాయంత్రం నాలుగు గంటలు దాటితే అత్యవసర కేసులు(ఎమర్జెన్సీ) వస్తే.. ఫోన్ చేసి వైద్యులను పిలిపించుకోవాల్సి దుస్థితి నెలకొంది. అత్యవసర కేసులకు ప్రథమ చికిత్స చేయించి, నగరానికి రిఫర్ చేస్తున్నారు. వాంతులు, విరేచనాలే తప్ప అడ్మిట్ కేసులుండవు. మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు షరామామూలే. ఇదిలా ఉండగా.. ఎవరి ఆదేశాలు పాటించాలో అర్థంకాని పరిస్థితిలో ఉన్నామని సిబ్బంది పేర్కొంటున్నారు. కాగా.. ఈ నెల 4న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ అజయ్‌కుమార్.. ఆస్పత్రిని సందర్శించారు. సమస్యలపై ఆరా తీశారు. త్వరలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

శంకుస్థాపనకే పరిమితం

ఆస్పత్రి కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ.. అది అక్కడికే పరిమితమైంది. ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి ఓ ప్రైవేట్ సంస్థ ముందుకు రావడంతో 2022 ఫిబ్రవరిలో నాటి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. కానీ ఎలాంటి పురోగతిలేదు. వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామన్న హామీ బుట్టదాఖలైంది.



250 ఓపీ కేసులు



మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి పరిధి గ్రామాల నుంచి నిత్యం 200 నుంచి 250 మంది అవుట్ పేషంట్లు వస్తుంటారు. బీపీ, షుగర్, ఫిట్స్ రోగులు పెరుగుతుండగా, అందుకు తగిన ఔషధాలు లేవు. షుగర్, బీపీ, సీబీపీలు మినహా మిగతా వైద్య పరీక్షలకు రక్త నమూనాలను సేకరించి నగరంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ ల్యాబ్‌నకు పంపిస్తున్నారు. అనంతరం ఆ రిపోర్టుల ఆధారంగా చికిత్స, మందులు అందజేస్తున్నారు. అల్ట్రాసౌండ్ పరికరాలు ఉన్నా.. పరీక్షించేందుకు సిబ్బంది లేరు.

నిరంతర సేవలు అందాలి



ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో సాయంత్రం 4 గంటలు దాటితే ఒక్క వైద్యుడు ఉండరు. ధర్మాసుపత్రికి ఎక్కువగా పేదలు వస్తుంటారు. బీపీ, షుగర్, ఫిట్స్ తదితర మందుల అందుబాటులో ఉండాలి. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలి. నిరంతరం వైద్య సేవలు అందాలి.

– రాజునాయక్, మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్

ఇబ్బంది లేకుండా సేవలు



సీహెచ్‌సీలో వైద్యవిధాన పరిషత్, డీఎంహెచ్‌ఓ సిబ్బంది పనిచేస్తున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. సీజనల్ వ్యాధుల ప్రభావం లేదు. సాధారణ ప్రసవాలు మాత్రమే చేస్తున్నాం. ఆపరేషన్లు చేయాల్సిన కేసులతో పాటు, అత్యవసర కేసులకు ప్రథమ చికిత్స చేసి, నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నాం.

– రాధిక, వైద్యురాలు, సీహెచ్‌సీ